క్లుప్తంగా

అభ్యసన సామర్థ్యాల పరిశీలన



ధరూరు: మండల పరిధిలోని మన్నాపురం ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం మండల విద్యాధికారి రవీంద్రబాబు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జరుగుతున్న ఎస్‌ఏ–2 పరీక్షలు పరిశీలించారు. రికార్డులు, పాఠశాల పరిసరాలు తనిఖీ చేశారు. అనంతరం మండల పరిధిలోని జాంపల్లి ప్రాథమిక పాఠశాలు సందర్శించారు. విద్యార్థుల అపార్ నమోదు కార్యక్రమాన్ని, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనులు సద్వినియోగం చేసుకోవాలి

మల్దకల్: జాబుకార్డు ఉన్న కూలీలందరూ ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీఓ రాజశేఖర్ సూచించారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో సాగుతున్న ఉపాధి హామీ పనులు ఆయన పరిశీలించారు. పని ప్రదేశం వద్ద కూలీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో కూలీలు ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అర్చకులు ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్త దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డు బాగుచేయరూ?



కొత్తకోట రూరల్: మండలంలోని చర్లపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా తయారైంది. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తకోట నుంచి వడ్డెవాట మీదుగా చర్లపల్లి వెళ్లే దారి దాదాపు 6 కిలోమీటర్లు ఉంటుంది. రోడ్డు గుంతలుగా ఏర్పడటంతో ద్విచక్రవాహనాలు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. కొన్నేళ్లుగా రోడ్డు ఇలాగే ఉన్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని, ఇప్పటికై నా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి రోడ్డును బాగుచేయాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

పాన్‌గల్: బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా నిరోధం, మాదక ద్రవ్యాల నిషేధం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ నరేందర్ అన్నారు. బుధవారం మండలంలోని అన్నారం తండాలో ఉపాధి కూలీలకు బాలల హక్కులు–రక్షణ చట్టాలు, బాలల సంక్షేమ సమితి ద్వారా అందిస్తున్న సర్వీసులు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, 112, 100 అంశాలపై అవగాహన కల్పించారు. బాలల హక్కులను పరిరక్షించేందుకు అందరూ బాధ్యత తీసుకోవాలన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు కంటి పరీక్షలు

ఆత్మకూర్: పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆర్‌బీఎస్‌కే వైద్యుల ఆధ్వర్యంలో కంటి, వైద్య పరీక్షలు నిర్వహించారు. బుధవారం ఆరేళ్ల లోపు చిన్నారులకు కంటి, మానసిక సమస్యలు గుర్తించేందుకు జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో డాక్టర్ నిస్సార్‌అహ్మద్, డాక్టర్ శంసూనీసా పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు రఘునందన్, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు ఉన్నారు.

తగలబడుతున్న ప్రభుత్వ లక్ష్యం

- మొక్కలకు నిప్పపెడుతున్న రైతులు, గుర్తు తెలియని వ్యక్తులు
- పట్టించుకోని అధికారులు



ఉండవెల్లిలో జాతీయ రహదారి మధ్యలో కాలిన మొక్కలు

ఉండవెల్లి: ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలు రైతుల, గుర్తు తెలియని వ్యక్తుల చర్యలతో తగులబడుతున్నాయి. నేటి వాతావరణంలో వస్తున్న మార్పులకు మొక్కల పెంపకం అనేది ముఖ్యమైన విషయం. కొందరు అభివృద్ధి పేరిట చెట్లను తొలగిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పచ్చదనం పెంచేందుకు ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలు, రహదారులకు ఇరువైపుల ఎవెన్యూ ప్లాంటేషన్, పార్కుల్లో మొక్కలు విరివిగా పెంచేందుకు చర్యలు తీసుకుంటుంది. కానీ అధికారుల నిర్లక్ష్యం, ప్రజల అవగాహన లోపంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. పరిడవిల్లాల్సిన పచ్చదనం తగులబడుతోంది.

నిప్పు పెట్టేస్తున్నారు..

జాతీయ రహదారి నుంచి ఉండవెల్లి వరకు వెళ్లే రహదారికి ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా నాటిన మొక్కలకు రైతులు అవగాహన లోపంతో నిప్పు పెట్టేస్తున్నారు. పంట కోతల ముగిసిన అనంతరం నిప్పు పెట్టే సమయంలో రోడ్డు పక్కకు ఉన్న చెట్లు, మొక్కలు కూడా తగులబడుతున్నారు. ఈ క్రమంలో అధికారుల నిర్లక్ష్యం కూడా కన్పిస్తుంది. రహదారి వెంట ముళ్ల పొదలు కమ్మేసిన తొలగించడానికి ఎలాంటి చర్యలు తీసుకోని నేపథ్యంలో రైతులు పొదలు తొలగించేటపుడు మొక్కలు కూడా తొలగిస్తున్నారు. మొక్కల పెంపకం, ఆవశ్యకతపై అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించకపోవడం కూడా కారణంగా ఉంటుంది. అంతేగాక వన సేవకులు కూడా బాధ్యతా రాహిత్యంగా ఉంటున్నారు. మొక్కలు ఎండిన చోట కొత్తవి ఏర్పాటు చేయకపోవడం, ఉన్న మొక్కల సంరక్షణ కూడా లేకపోవడంతో ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చుపెట్టి నిర్వహిస్తున్నా ఎవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమం నిరుపయోగంగా ఉంది.



అలంపూర్ చౌరస్తా- అలంపూర్ మధ్యలో కాలిన మొక్కలు

రూ.లక్షలతో నర్సరీల నిర్వహణ..

గ్రామాలు పచ్చదనంతో పరిడవిల్లేలా ప్రతి గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున నర్సరీ నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఒక్కొక్క జీపీలో వేల మొక్కలు పెంచుతున్నారు. మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉండగా ఒక్కొక్క నర్సరీ నిర్వహణకు రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు ఖర్చు చేస్తున్నారు. ఈ సంవత్సరం వర్షాకాలంలో లక్ష మొక్కలు వర్షాకాలంలో నాటేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నర్సరీల నిర్వహణకు మండల వ్యాప్తంగా దాదాపుగా ప్రతి సంవత్సరం రూ.30 లక్షల నుంచి 40 లక్షల వరకు ఖర్చు అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇలా రూ. లక్షలు ఖర్చుపెట్టి నర్సరీల్లో మొక్కలు పెంచి రోడ్లకు ఇరువైపులా మొక్కలు ఏర్పాటు చేస్తున్నా కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా నిధులు వృథా అవుతున్నాయి. ఇప్పటికై నా జనహితం కోసం చేపడుతున్న కార్యక్రమంపై పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని మండల వాసులు కోరుతున్నారు.

మొక్కలు కాపాడేందుకు ప్రయత్నిస్తున్నాం

గ్రామాల్లో పలుచోట్ల మొక్కలు కాపాడేందుకు వన సేవకులను ఏర్పాటు చేశాం. కానీ రోడ్డు ఇరువైపుల మొక్కలకు రైతులు, గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెడుతున్నారు. మొక్కలు ఎండిపోయిన, కాల్చిన చోట వర్షకాలంలో మొక్కలు ఏర్పాటు చేస్తాం.

-సౌజన్య, ఏపీఓ, ఉండవెల్లి

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందుకున్న విజేతలు

అయిజ: మండలంలోని ఈడుగోనిపల్లి గ్రామంలో ఈనెల 8, 9 తేదీల్లో నాలుగుపళ్ల విభాగం, సేద్యపు ఎద్దుల విభాగాల వృషభాల బల ప్రదర్శన (బండ లాగుడు పోటీలు)నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలైన ఎద్దుల యజమానులకు నిర్వాహకులు బుధవారం నగదు బహుమతులు అందజేశారు. నాలుగుపళ్ల విభాగంలో బోయ మొగిలి తిమ్మయ్య మొదటి బహుమతి రూ. 10 వేలు, గొల్ల పిడదల జయరాములు రెండో బహుమతి రూ.5 వేలు నగదు బహుమతి అందుకున్నారు. అదే విధంగా సేద్యపు ఎద్దుల విభాగంలో బోయమొగిలి పెద్ద ఆంజనేయులుకు మొదటి బహుమతి రూ.10 వేలు, బోయ మల్దకల్‌కు ద్వితీయ బహుమతి రూ.5 వేలు నగదును నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



బిజ్వారంలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి

మల్దకల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎదుగుదలపై అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి పెట్టాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి అన్నారు. బుధవారం మండలంలోని బిజ్వారం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బరువు తక్కువగా ఉన్న చిన్నారులను గుర్తించి వారి ఎదుగుదలకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు పాలు, పండ్లతో పాటు పోషకాలు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవడంతో పాటు, నెలనెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. అదే విధంగా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. గర్భిణులకు రక్తహీనతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పార్వతమ్మ, వరలక్ష్మి, అనంతమ్మ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

వర్ధంతి సభలు విజయవంతం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

అయిజ: ఉస్మానియా ధ్రువతార, కామ్రేడ్ జార్జిరెడ్డి వర్ధంతి సభలు విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హాలీంపాష అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర వసతి గృహంలో జార్జిరెడ్డి సభలకు సంబంధించిన పోస్టర్లను పీడీఎస్‌యూ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హాలింపాష మాట్లాడారు. ఈనెల 10 నుంచి 14 వరకు వర్ధంతి సభలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీలో మతోన్మాదానికి వ్యతిరేకంగా, మహిళలపై జరిగే లైంకిగ దాడులకు వ్యతిరేకంగా పిడికిలి బిగించి పోరాడిన విప్లవ విద్యార్థి జార్జిరెడ్డి అని కొనియాడారు. జార్జిరెడ్డి ఆశయ సాధన కోసం విద్యార్థులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు రుద్రకుమార్, శివకుమార్, శరత్, మహేష్, పవన్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

భూవివాదంలో దాడి.. కేసు నమోదు



గాయపడిన సుదర్శన్

ఇటిక్యాల: భూవివాదంలో దాడిపై కేసు నమోదైన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్, స్థానికులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని పెద్దదిన్నె గ్రామానికి చెందిన సుదర్శన్‌కు తన అన్న కుమారుడు సుధాకర్‌తో కొంత కాలంగా పొలం విషయంలో తగాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సుధాకర్ బుధవారం పొలం దగ్గర సర్వే నిర్వహిస్తుండగా అక్కడకు వచ్చిన సుదర్శన్ వాగ్వాదం జరుగడంతో ఆవేశానికి గురైన సుధాకర్ ఒక్కసారిగా సుదర్శన్‌పై దాడి చేశాడు. దాడిలో సుదర్శన్‌కు రక్త గాయాలైనట్లు తెలిపారు. బాధితుడు సుదర్శన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



పెద్దొడ్డి- మల్దకల్ మధ్య ప్రమాదకర మలుపు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే రహదారుల్లో మూల మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికై నా సంబంధిత అధికారులు మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

కంటి అద్దాల పంపిణీ



రాజోళి: చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు శివరామయ్య ఆధ్వర్యంలో గత నెల 27న కంటి వైద్య శిబిరం నిర్వహించగా కొందరికి మందుల పంపిణీ చేయగా, బుధవారం 40 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షుడు ఎండీ నిషాక్, గద్వాల జిల్లా రైట్స్ అండ్ క్రైమ్ కంట్రోల్ బ్యూరో అధ్యక్షుడు హసన్ సహకారంతో అద్దాలు పంపిణీ చేసినట్లు శివరామయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆపరేషన్లు అవసరమైన వారికి ఈనెల 16న హైదరాబాద్ తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఫ్యాన్స్ మండల ఉపాధ్యక్షుడు హుస్సేన్, డాక్టర్ రవి, వీరేష్ తదిదరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



ఆత్మకూర్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీని పూర్తిస్థాయిలో చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రాబర్ట్, సీపీఐ జిల్లా నాయకుడు మోషి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించి, పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ చాంద్‌పాషకు అందజేశారు. దీంతో పాటు రైతులందరికీ రైతు భరోసా, గిట్టుబాటు ధర, బోనస్ ఇవ్వాలని కోరారు. పశువులకు దాణ సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో వెంకటన్న, లింగన్న, కురుమూర్తి, భీమన్న, కొండన్న, రైతులు పాల్గొన్నారు.

ధనవంతులకు దోచిపెట్టే ప్రభుత్వం



ఉండవెల్లిలో సిలిండర్‌తో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు



గద్వాలలో గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ ఆందోళన చేపట్టిన సీపీఎం నాయకులు

గద్వాలటౌన్: కేంద్రంలో మోదీ ప్రభుత్వం పేదలను ఆదుకునే ప్రభుత్వం కాదని.. అదాని, అంబానీలాంటి ధనవంతులకు దోచిపెట్టే ప్రభుత్వమని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. గ్యాస్ సిలిండర్ ధర పెంపుపై సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పాత బస్టాండ్ చౌరస్తాలో ఖాళీ గ్యాస్ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్రం తప్పుడు విధానాల వల్ల రూపాయి విలువ పడిపోయి డాలర్ విలువ పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరుతో దేశంలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రాల్లో ఎన్నికలు అయిన ప్రతిసారి గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడం కేంద్ర ప్రభుత్వానికి ఆనవాయితీగా మారిందని విమర్శించారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఉప్పేర్ నర్సింహ, చందు, నరేష్, నంద, హరి, గోవిందు, పరుశరాముడు, ఆనంద్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

సిలిండర్ ధరలు తగ్గించాలి

ఉండవెల్లి: కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలు పెంచడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే ధరలు తగ్గించాలని సీఐటీయూ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో ఖాళీ గ్యాస్ సిలిండర్లతో నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూ.50 పెంచి ప్రజలపై భారం మోపడం సరైన నిర్ణయం కాదని మండిపడ్డారు. వెంటనే గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో షేక్షావలి, నాగరాజు, అంజి, రాజు, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి



ప్రదర్శనలు తిలకిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

రాజోళి: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలని ఎంఈఓ భగీరథ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఎంపీపీఎస్ పాఠశాలలో ఎంవీ ఫౌండేషన్, సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో బుధవారం సబ్జెక్ట్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వారి నైపుణ్యాన్ని ప్రదర్శించారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఈవీఎస్ సబ్జెక్టల వారీగా మూడో తరగతి నుంచి ఏడో తరగతి వరకు గల విద్యార్థులు టీఎల్‌ఎం మెటీరియల్‌ను తయారు చేసి పలు రకాల ప్రదర్శనలు ఇచ్చారు. విద్యార్థుల ప్రదర్శనలో ఎంతో సృజనాత్మకత, నైపుణ్యం ఉన్నాయని ఎంపీడీఓ ఖాజా మొయినుద్దీన్ అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రదర్శనలు తిలకించారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు నిషాక్, ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు, మాజీ ఉప సర్పంచ్ దస్తగిరి, అబ్దుల్ రెహమాన్, శాంతయ్య, రమేష్, శ్రీను తదిదరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

ధరూరు: మండల పరిధిలోని ఓబులోనిపల్లి ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. హెచ్‌ఎం చిరంజీవి నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయ్ శివకుమార్, ఉపాధ్యాయులు ఎండీ వసీం, నర్సింహులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి



కేటీదొడ్డిలో సమావేశంలో బీజేపీ నాయకులు



మానవపాడులో సమావేశంలో బీజేపీ నాయకులు

మానవపాడు/కేటీదొడ్డి/శాంతినగర్: గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. మానవపాడు మండల కేంద్రంలో బీజేపీ జెండాను బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలన్నారు. అదే విధంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ప్రతి కార్యకర్త ఇంటిపై బీజేపీ జెండా ఎగురవేయాలని నాయకులు రామచంద్రారెడ్డి అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజగోపాల్, బీజెవైఎం రాజశేఖర్ శర్మ, మండల నాయకులు లక్ష్మీనారాయణ, కురమన్న, రవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

- కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రజక నర్సింహులు అన్నారు. కేటీదొడ్డి మండల కేంద్రంలోని నిర్వహించిన గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 6 గ్యారంటీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. గత 10 ఏళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నడిగడ్డకు చేసిందేమి లేదని పేర్కొన్నారు. ఈనెల 11 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే గ్రామస్థాయి సామాజిక కార్యక్రమాల్లో ప్రతి ఒక్క కార్యకర్త పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మీడియా జిల్లా ఇన్‌చార్జ్ చిత్తరి కిరణ్, జిల్లా కౌన్సిల్ హన్మిరెడ్డి, నాయకులు బీంరెడ్డి, సూర్యకాంత్ రెడ్డి, కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.
- కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించి, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు సంగాల సంజీవరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ కార్యవర్గ సమావేశం శాంతినగర్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సంజీవరెడ్డి మాట్లాడుతూ.. గావ్ చలో.. బస్తీ చలో కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో బీజేపీ పట్ల చైతన్యం తీసుకురావాలన్నారు. అదే విధంగా అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి సంజన్నగౌడ్, ఉపాధ్యక్షులు మోహన్‌యాదవ్, రవి, బూత్ అధ్యక్షులు శివ, శేఖరాచారి, సురేష్, తిమ్మప్ప పాల్గొన్నారు.

‘ఏకమవుదాం.. రెవెన్యూ డివిజన్ సాధిద్దాం’



మాట్లాడుతున్న సీనియర్ న్యాయవాది తిప్పారెడ్డి

ఆత్మకూర్: సంస్థానంగా, తాలుకా కేంద్రంగా కొనసాగిన ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా సాధించుకునేందుకు అందరూ ఏకం కావాలని సీనియర్ న్యాయవాదులు వై తిప్పారెడ్డి, నారాయణగౌడ్ అన్నారు. బుధవారం స్థానిక మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ భవనంలో బార్ అధ్యక్షుడు జీకే రాములు, ఉపాధ్యక్షుడు దివాన్జీ అశోక్‌కుమార్, ప్రధానకార్యదర్శి ముక్తేశ్వర్‌తో కలిసి మాట్లాడారు. అలాగే విరాట్ విశ్వకర్మ సంఘం రాష్ట్ర నాయకడు బంగారు భాస్కర్ స్వర్ణకారులతో రాఘవేంద్రస్వామి ఆలయం వద్ద సమావేశమయ్యారు. ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి ఆత్మకూర్ రెవెన్యూ డివిజన్ అంశాన్ని ఇది వరకే అసెంబ్లీలో దృష్టికి తీసుకెళ్లగా.. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సైతం ఈ విషయమై కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. ఆత్మకూర్‌కు అన్ని అర్హతలు ఉన్నాయని, ఇక్కడ ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ స్థలాలు ఉన్నాయని, జూరాల ప్రాజెక్టు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం, సివిల్ కోర్టుతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయన్నారు. అన్ని పార్టీల నాయకులు, ప్రజా, కులసంఘాల నాయకులు, వర్తక, వ్యాపారులు కలిసి రావాలని పిలుపునిచ్చారు.